

ఆయన స్వంత లైబ్రరీ చూస్తే అసూయాజనకంగా
వుంటుంది. ఆయన ధనవంతుడు గాదు.
సామాన్య లెక్చరర్. ఆయన సంపాదనలో సగభాగం
పుస్తక సేకరణకే వెచ్చించినట్లు కన్పిస్తుంది.

# గురువులకు గురువు

**శ్రీ ఆవుల మదనమోహన్,** లెక్చరర్ (రిటైర్డు)

ఈమధ్య ఒక సందర్భంలో పూజ్యులు జస్టిస్ ఆవుల సాంబశివరావుగారిని కలవటం తటస్థించింది. మాటల సందర్భంలో వారు నన్నొక ప్రశ్నవేశారు. 'నీ దృష్టిలో ఉత్తమ (ఆదర్శ) ఉపాధ్యాయుడు ఎవరు?' అని.

క్షణకాలం మౌనం వహించి, 'ఇంకెవరు, కీర్తిశేషులు శ్రీ ఎలవర్తి రోశయ్యగారు' అన్నాను.

వారు వెంటనే 'విపులీకరించు' అన్నారు.

దాంతో జ్ఞాపకాల పుటలు వడివడిగా కదిలాయి. శ్రీ రోశయ్య గారితో యాభై సంవత్సరాలుగా వున్న అనుబంధం, ఆప్యాయత, వారి సంభాషణా చాతుర్యం, విజ్ఞాన తృష్ణ, తనకు తెలిసిందంతా యితరులకు అందించాలన్న వారి ప్రగాఢ ఆకాంక్ష, ఆయన విద్యార్థులను, నిష్ణాతులుగా తీర్చిదిద్దాలన్న పట్టుదల, పుస్తకాల (మంచివి) యందు వారికున్న ప్రేమానుగారాలు, ఒకటనేమిటి, ఎన్నో, ఎన్నెన్నో నన్ను ఆలోచనా తరంగాలలో ఓలలాడించి పరవశుణ్ణి చేశాయి.

అదేమాట శ్రీ సాంబశివరావు గారితో అన్నాను. శ్రీ రోశయ్యగారు, క్లాసులో పాఠం చెప్పేటప్పుడు గాని, యితరత్రా సంభాషణలో గాని, ఎన్ని విషయాలను కాకతాళీయంగా పాఠానికి మాటలకు ముడిపెట్టి

ఎక్కడెక్కడి విషయాలు సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషలలో మహోన్నతంగా వివరించిన విషయాలు ఎలా విద్యార్థుల ముందు ఉంచేవారో అన్నాను.

తద్వారా, విషయాన్ని వివరించటమేకాదు. విద్యార్థిలో జిజ్ఞాసను రేకెత్తించి, తెలుసుకోవాలన్న ఆతృతను పెంచి పోషించటం అచ్చెరువొందిస్తుంది.

ఎన్ని పుస్తకాలు ప్రస్తావించేవారో, ఎంతమంది మహా రచయితల్ని పరిచయం చేసేవారో, ఇప్పుడు యిన్ని సంవత్సరాల తర్వాత కూడా ఆయన దగ్గర కూర్చుని మాట్లాడుతూ, ఆయన మాటలు వింటున్న అనుభూతి మనసుని పులకింపజేస్తోంది.

నాకు పది పన్నెండేళ్ళు వుంటాయి. మేము మా గ్రామంలో (మూల్పూరు-తెనాలి తాలూకా) ఉండేవాళ్ళం. మా నాన్నగారి తమ్ముడు-మా చిన్నాన్న, కీర్తిశేషులు శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు, శ్రీ రోశయ్యగారికి ఏ.సి. కాలేజీలో స్నేహితులట. అందుచేత మా చిన్నాన్న గారితో కలిసి మావూరు శలవుల్లో వచ్చేవారు. మా నాన్నగారిని అన్నయ్యగారు అని పిలుస్తూవుండేవారు. పిల్లలమైన మేము అప్పటినుండి రోశయ్య గారిని బాబాయిగారు అని సంబోధిస్తూ వుండేవారం.

ఆయన మావూరు వచ్చినప్పుడు, మా చిన్నాన్న గారితోపాటు చాలామంది స్నేహితులు ఉండేవారు. వారు ఏవేవో మాట్లాడుకుంటూ వుండేవారు. మాకు అట్టే అర్థమయ్యేది కాదు. కాని అప్పుడు గూడ నాకు రోశయ్య గారు ఎందుకో చాలా విలక్షణమైన వ్యక్తిగా కనిపించేవారు.

మా చిన్నాన్న గారు తరువాత అడ్వకేట్‌గా తెనాలిలో ప్రాక్టీసు చేసేవారు. మేము గూడ కొంచెం పెద్దవాళ్ళమయ్యాం. విషయాలు కొద్దికొద్దిగా అర్థం కాజొచ్చాయి. మా చిన్నాన్నగారి దగ్గరకు చాలామంది వస్తుండేవారు. క్లైంట్లుగాదు కవులు, గాయకులు, పండితులు, రాజకీయ చతురులు, యింకా యితరమైన విశిష్ట వ్యక్తులు. అక్కడే మా అదృష్టం

కొద్దీ శ్రీ జాషువా గారిని, శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారిని, శ్రీ వేంకటకవి గారిని, శ్రీ గోపీచందు గారిని, శ్రీ జి.వి. కృష్ణారావు గారిని, శ్రీ వేంకట నరసయ్య గారిని, కొప్పరపు కవులను, యం.యన్. రాయ్ దంపతులను, శ్రీ తార్కుండే, శ్రీ శిబ్‌నారాయణ్ రే లాటి మహామహుల్ని దర్శించుకునే భాగ్యం కలిగింది.

ఒకరోజు సాయంత్రం ఆదివారమనుకుంటా, శ్రీ రోశయ్యగారు వచ్చారు. వస్తూనే తనతో పట్టుకొచ్చిన మంచి బైండులతో వున్న పుస్తకాల దొంతరను తెరిచి, అక్కడున్న వారికి తలాఒకటీ ఇచ్చారు.

ఏమిటా అది అని నేను ఆతృతగా చూచాను. శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి గారు ప్రచురించిన పంచతంత్ర కథలు. శ్రీ రోశయ్యగారు చిన్నపిల్లవాడిలా సంబరపడిపోతూ, చూడండి ఎంత పకడ్బందీగా వుందో. ఒక్క అక్షరదోషం లేదు. చదవండి మీవాళ్ళచేత చదివించండి అని.

అప్పుడు నాకేదో వింతగా అన్పించినా, కాలక్రమేణా, నేను ఆయన దగ్గర బి.ఎ. లిటరేచర్ విద్యార్థిగా, ఆ తరువాత వారితో కలిసి అధ్యాపకుడుగా గూడ పనిచేసే అదృష్టవంతుడుగా-ఎన్ని నేర్చుకున్నానో, ఎంత ఆనందించేవాణ్ణో-మాటలు చాలవు. నేనే కాదు మా మిత్రులందరం గూడ.

శ్రీ రోశయ్యగారు మాకు ''హేమ్లెట్'' షేక్స్పియర్ రచన, మిల్టన్ ''శాంసన్ ఏగొనిస్టెస్'' యింకా యితర కావ్యాల్ని బోధించారు క్లాసురూములో. క్లాసుక్లాసుకు వస్తూ పదిపదిహేను రచయితలు ఎడిట్ చేసిన ''హేమ్లెట్'' అలాగే ''శాంసన్ ఏగొనిస్టెస్'' తెచ్చేవారు. గబగబా వాటిని క్లాసులో పంచేవారు. అప్పుడు పాఠం మొదలెట్టేవారు.

శ్రీరోశయ్యగారికి చక్కగా బైండుచేసి, చక్కగా ప్రింటు చేసిన పుస్తకాలు తప్ప, పిచ్చిపిచ్చిగా వుండే పుస్తకాలు నచ్చేవికావు. పైగా ఈ పేపర్‌బాక్స్ చూచి ఈసడించుకునేవారు.

పుస్తకం తెరిచి వెనక్కి ఒకసారి విరిచి దుమ్ము దులిపి, పేజీ తిరగేశేవారు.

''హేమ్లెట్'' మొదటిపేజీ ''హేమ్లెట్. ప్రిన్స్ ఆఫ్ డెన్మార్క్''. సీన్ ఒకటి. ''ఎల్సినోర్''. అంతే అక్కడి తోడి పుస్తకాన్ని వేలుపెట్టి మడిచి పుచ్చుకొని, అనండి - ఏదీ ''ఎల్సినోర్'' అని క్లాసంతటిచేత కోరస్‌గా అన్పించటం, నేను యిప్పటికీ మరిచి పోలేను. క్లాసులో పది మందో పన్నెండుమందో అనుకుంటే పొరబడ్డారు. నూట యాభైమంది. దానిమీద ఒకరోజు, రెండురోజులు, మూడురోజులు - ఎల్సినోర్ - దాని విశిష్టత గురించి వివరణ.

నేను లెక్చరర్‌గా జేరాక, శ్రీరోశయ్యగారు మాకు ప్రిన్సిపల్. వారితో కలిసి, వారి అజమాయిషీకింద పనిచేయటం, ఒకవిధంగా కత్తిమీద సాము, వేరొకవిధంగా, మధురమైన అనుభూతి.

వారిలాగా పాఠం చెప్పాలని శత విధాల ప్రయత్నించేవాణ్ణి. కాని వారి పాండిత్య ప్రకర్ష మాకేది. కాకుంటే మాకు చేతయినంతలో వారిలాగానే విద్యార్థుల్లో ఆసక్తిని పెంచటానికి మాకు చేతనైన కృషిచేశాము.

ఒకసారి నన్ను అర్జంటుగా రమ్మని-ఆయన క్లాసుకి వెళ్ళమన్నారు. ఆఫీసులో అర్జంటు పనివుంది క్లాసుకుపోయి ఏం చెపుతావు అన్నారు. మీరు చెప్పేదాన్ని కంటిన్యూ చేస్తానన్నాను. సరే అని, ఏమిటి నేను చెప్పేది అన్నారు. ''లెవోడమయ్యా'' గదా అన్నాను. ముసిముసిగా నవ్వుకుంటూ, గుడ్ పద అన్నారు. ఆ 'లెవోడమయ్యా' స్పెల్లింగ్ ''లొడామియా''గా వుంటుంది. నా నన్సియేషన్ టెస్టు చేయటానికన్నమాట అలా నన్ను క్లాసుకు పంపింది.

శ్రీ రోశయ్య గారు ఇతర పాండిత్యాలతో పాటు భాషాస్వచ్ఛత, సరిగా పలకటం గూడ అందరికీ తప్పనిసరి అంటారు. ఆయన్ని ఆ రోజుల్లో రోశయ్యదంతా చాదస్తం అని అంటూ వుండేవారు. కాని ఆయన జీవితాంతం perfectionistగానే బ్రతికారు.

న్యూస్‌పేపరు చదువుతున్నా గూడ ఎప్పుడూ ఆయన చేతిలో ఎర్ర పెన్సిలు వుండేది. తప్పులు మార్కుచేస్తూ వుండేవారు.

ఒక సందర్భంలో శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారు అన్నారు. నాకు ఎవరిని చూచిన జంకులేదు. కాని భాష విషయంలో, వ్యాకరణం విషయంలో రోశయ్యను చూస్తే కొంచెం జంకుగా వుంటుందని.

శ్రీ రోశయ్యగారు మాకందరికీ ఎప్పుడూ చెపుతూవుండేవారు. ప్రతి అధ్యాపకుడికీ, విద్యార్థికి చరిత్రజ్ఞానం కలిగివుండి, భౌగోళిక స్థితిగతులు గూడ అవశ్యం అవగాహనలో వుండాలని. అందుకే ప్రతివారి దగ్గర ఒక అట్లాస్, ఒక డిక్షనరీ ప్రక్కనే వుండాలని.

ఆయన జే.కే.సి. కాలేజీకి ప్రథమ ప్రిన్సిపల్. యానివర్శిరీకి విద్యార్థులకు యిచ్చే పురస్కారాలు, ఆటల్లోనివారికి తప్ప, తతిమ్మావారికి పుస్తకాలు మాత్రమే యిప్పించేవారు. అవి గూడ ముఖ్యంగా, అట్లాసులు, డిక్షనరీలు, 'సాక్షి' వ్యాసాలు మొదలయినవి.

శ్రీ రోశయ్య గారికి పానుగంటివారంటే ప్రాణం. ఇంగ్లీషులో మిల్టన్, శామ్యూల్ జాన్సన్, మాథ్యూ ఆర్నాల్డ్‌లు దైవస్వరూపులు. నీతినిజాయితీలకు పట్టం కట్టేవారు, భాషాపటిమను, పరిపుష్టిని ప్రదర్శించేవారు, ఉదాత్తమైన విషయాలను, అత్యంత మహోన్నతంగా రచించేవారు వారికి ఆదర్శప్రాయులు. ప్రపంచమంతా షేక్స్పియర్‌ని కొనియాడుతుంటే, శ్రీ రోశయ్య గారికి మిల్టన్ కంటే గొప్ప రచయిత మరొకరు లేరు. ఆయనకు సరిరారు అంటూ వుండేవారు.

శ్రీ రోశయ్యగారు ప్రిన్సిపల్‌గా వుండగా జె.కె.సి. కాలేజీలో 'చిన్నయ' వర్ధంతి సభలు ఒక వారం రోజులపాటు నిర్వహించాం. ఆంధ్రదేశంలోని గొప్పగొప్ప పండితులనందరినీ ఆహ్వానించాం. శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారు, చిన్నయసూరి వ్యాకరణం మీద చేసిన ఉపన్యాసం మరపురానిది మరువలేనిది. ఆ ఉపన్యాసకులు, ఆ సభలు శ్రీ రోశయ్య గారికి చిన్నయసూరి పట్ల గల ప్రగాఢ భక్తికి, ప్రేమకు నిదర్శనం. వారికి చిన్నయసూరి పట్ల ఉన్న గౌరవాన్ని యింకొక అడుగు ముందుకువేసి వారి ప్రథమ సంతానానికి ఆ పేరు పెట్టుకోవటం గమనార్హం.

జె.కె.సి. లైబ్రరీలో వారు ప్రిన్సిపల్‌గా వున్నంతకాలం, ఒక్క పేపర్‌బాక్ కూడ లేదంటే ఆశ్చర్యం లేదు. అక్కడి కలెక్షన్ చూచి యూనివర్శిటీ అధ్యాపకులు సైతం అచ్చెరువొందిన సందర్భాలెన్నో.

ఆయన స్వంత లైబ్రరీ చూస్తే అసూయాజనకంగా వుంటుంది. ఆయన ధనవంతుడు గాదు. సామాన్య లెక్చరర్. ఆయన సంపాదనలో సగభాగం పుస్తక సేకరణకే వెచ్చించినట్లు కన్పిస్తుంది.

శ్రీ రోశయ్య గారికి ధూమపానం చేసేవాళ్ళంటే గిట్టదు. ఎంతటివారైనా సరే. కాలేజీ యాజమాన్యం అంతా సిగరెట్లు కాల్చేవారే. కాని అంత పెద్దవారు గూడ ఆయనమీద గౌరవంతో ఆయనముందు ఎవ్వరూ సిగరెట్టు కాల్చేవారుకాదు. కాలేజీలో సీట్లు మెరిట్ బేసిస్‌మీద యిచ్చేవారు. సిఫార్సులంటే ఆయనకు గిట్టదు. మేనేజిమెంటువారు గూడ ఏదైనా సీటు కావాలంటే చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసి వచ్చేది.

ఒకసారి డా॥ సదాశివరావుగారు, అప్పుడు కాలేజీ సెక్రటరీ, ఒక చీటీ వ్రాసి పంపిస్తే ''ఇదేమన్నా మెడికల్ ప్రిస్క్రిప్షన్ అనుకుంటున్నారా'' అని రోశయ్యగారు తిరస్కరించటం అందరినీ ఆశ్చర్యంలో, ఆనందంలో గూడ ముంచింది.

శ్రీ రోశయ్యగారు గొప్ప సంభాషణాచతురులు. కాని వ్రాయాల్సివచ్చేసరికి చాలా జంకేవారు. కారణం ఏమీలేదు-ఆయన perfectionist కావటమే. తృప్తిచెందేవారు కాదు. కాలేజీ యానివర్శరీకి ప్రిన్సిపల్ రిపోర్టు గూడ ఆయన వ్రాసేవారు కాదు. గైడ్‌లైన్స్ యిచ్చి నన్ను వ్రాయమనేవారు. తరువాత దానిని ఛిజిల్ చేసి సమర్పించేవారు. అప్పుడు నాకు అన్పిస్తూవుండేది "fools rush in while Angels fear to tread in" అని.

శ్రీ రోశయ్యగారు ఎంతటి పుస్తక ప్రియులో, అంత భోజనప్రియులు గూడ. కాలేజీలో ఎప్పుడూ సూటులోనే కన్పించేవారు. వేసవికాలం కాని, చలికాలం కాని బయట మాత్రం చొక్కా టక్ చేసి

వుండేవారు. అందమైన విగ్రహం. ఆయన ఎక్కడుంటే అక్కడ సందడి. అదొక పండిత పరిషత్.

అందుకే ఆయన ఒక నాయకుడు. 'హీరో యాజ్ పోయట్' రచయిత. కార్లైల్ అంటే చాలా యిష్టం. శ్రీ రోశయ్య గారిని నేను ఒక ''హీరో యాజ్ ఏ టీచర్''గా ''హీరో యాజ్ ఏ మాన్''గా సంభావిస్తాను. పండితుడు సర్వదా పూజ్యుడు. శ్రీ రోశయ్య గారిలోని నమ్రత, పండితుల యడల గౌరవం, జ్ఞాన తృష్ణ ప్రతివారు అలవరచుకుంటే ఈ లోకం ఎంత సుసంపన్నంగా వుంటుందో.

శ్రీ రోశయ్యగారు మాకు బి.ఏ. ఆఖరి సంవత్సరంలో వీడ్కోలు సందేశమిస్తూ, ''మంచివారుగా మెలగండి, మంచి పుస్తకాలు చదువుకోండి, మీ చుట్టుప్రక్కల వారిచేత చదివించండి'' అని దీవించి పంపారు.

శ్రీ రోశయ్య గారిని అనుకరించే మాలాంటి వాళ్ళు యిసుమంతయినా ఆయన ఆదర్శాలను ఆచరించగలిగితే ధన్యులం.

# ప్రశంస

## కళాప్రపూర్ణ శ్రీతుమ్మల సీతారామమూర్తి

ఆశలగాల్చు నింద్యముల, నన్వహమున్ గురు ధర్మరక్షణా.
వేశము దాల్చు, సత్య పదవీ నదవీయసియైన వాణికిన్
గోశముగా దనర్చు, బుధగోష్ఠికివార్చు, నెలర్చుగైతకున్
రోశయ, శాంతిసౌఖ్య రుచిరుండగుగాక యితండు నిచ్చలున్.

తెలుగు నేర్చ నేమ దిట్టల మనువార
లడలుచుంద్రు రోశయాఖ్యగదియ,
గలడె యింగిలీసు కఱపెడి యాచార్య
సముదయమున నిట్టి సవ్యసాచి;